

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు



సంపుటి : 29 సంచిక : 2 అక్టోబర్ 2023

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥ 150/-

విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

## ఈ సంచికలో. . . .

హనుమంతుడి వాక్కు ప్రజ్ఞ.......................................... 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ................ 3

అక్షరమణమాల ..................................................... 23

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం



మిమ్మల్ని మీరు ఎలా ప్రేమించుకొంటున్నారో

అలాగ ఇతరులను ప్రేమించగలిగినవాడే

కర్మయోగి అవుతాడు

# హనుమంతుడి వాక్కు ప్రజ్ఞ



**(శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి సేకరణ)**

ఆంజనేయస్వామిలో ఆ గుణం ఉంది. ఆయన వ్యాకరణ శాస్త్రవేత్త, నాలుగు వేదాలు చదువుకున్నాడు, బుద్ధిమంతుడు. ఆయన వ్యాకరణ శాస్త్రంలో పాండిత్యం, వినయము చూసి రాముడు కూడా ఆశ్చర్యపోయాడు. మాట ఎంతవరకూ చెప్పాలి, ఎంత పొందికగా చెప్పాలి, ఎక్కడివరకూ చెప్పి ఆపుచెయ్యాలి - ఫాల్ట్‌లెస్ (faultless) లాంగ్వేజ్ మాట్లాడతాడు ఆంజనేయస్వామి. ఆ మాటలు మాట్లాడేటప్పుడు ఒక్క పొరపాటు మాట ఉండదు, ఒక అపస్వరం ఉండదు. ఆయనది కరెక్ట్ జడ్జిమెంట్. ఈ రాముడిని లక్ష్మణుడిని అంతకుముందు చూడలేదు, కానీ ఆయన జడ్జిమెంట్ చూడండి. ఏంటి మీ ముఖాలు చూస్తే రాజుల ముఖాల్లాగ కనిపిస్తున్నాయి, వేషాలు బ్రాహ్మణుల వేషాలలాగా కనిపిస్తున్నాయి అని ఆంజనేయస్వామి కనిపెట్టేశాడు. అది కరెక్ట్ జడ్జిమెంట్. మనం ఎవరూ లేనప్పడు మనకి మనమే పరిచయం చేసుకోవాలి కదా. అప్పడు ఆంజనేయస్వామి ఎవరూ లేనప్పడు ఆయనని ఆయనే పరిచయం చేసుకున్నాడు రామలక్ష్మణులతోటి. ఆయన మాట పూర్తి చేయకుండా, లక్ష్మణుడు మొదలుపెడితే, వాడు మాట్లాడేది పూర్తిగా మనం వినాలి. మధ్యలో అడ్డుపడకూడదు లక్ష్మణా అంటాడు రాముడు. ఎదుటివాళ్ళు ఏదైనా చెపుతూవుంటే వినాలి, మధ్యలో అడ్డుపడకూడదు. తరువాత మీరు ప్రశ్నలు అడగవచ్చు. లక్ష్మణా, మారుతి మాట్లాడుతున్నాడు, మనం విందాం. వాడి మాట పూర్తి చెయ్యనియ్యి. వాడు ఇన్ఫర్మేషన్ చెపుతున్నాడు వాడి గురించి, నేను సుగ్రీవుడి మంత్రినని చెపుతున్నాడు. ఇన్ఫర్మేషన్ రెండో పక్షం. వాడు మాట్లాడే భాషలో ఉన్న సౌందర్యం చూడు లక్ష్మణా. వాడి భాషలో ఉన్న అందాలు చూడు. ఎక్కడైనా ఒక పొరపాటు మాట్లాడుతున్నాడేమో చూడు. ఎక్కడైనా ఉద్రేకపడి ఏదైనా మాట్లాడుతున్నాడేమో చూడు. తరువాత నువ్వు చెపుదువుగాని కంగారు పడకు. వాడిని పూర్తి చెయ్యనియ్యి, అంటాడు రాముడు.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 1 సెప్టెంబర్ 1995, విశాఖపట్నం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఇప్పుడు ఎవరైనా ఏదైనా చెపుతున్నప్పుడు దేని గురించి అయితే వాడు చెబుతున్నాడో వాడు కెమిస్ట్రీ చెప్పనివ్వండి, ఫిజిక్స్ చెప్పనివ్వండి ఆ సబ్జెక్టుకి సంబంధించిన అనుభవం ఆ గ్రిప్ వాడికి ఉండాలి. ఇప్పుడు మనం అందరం దేని గ్రిప్పులో ఉన్నాం? అహంకారం యొక్క పట్టులో ఉన్నాం. మీకు అర్థం అవుతోందా? ఇప్పుడు మనం దేవుడి పట్టులో లేము, ఎవరి పట్టులో ఉన్నాం? అహంకారం యొక్క పట్టులో ఉన్నాం. మన అహంకారాన్ని ఎవరైనా కొద్దిగా గాయపరిస్తే జీవితంలో మనం మర్చిపోలేము. మన దేహానికి ఏదైనా దెబ్బ తగిలితే మర్చిపోతాం కానీ మన అహంకారాన్ని ఎవరైనా హర్ట్ చేస్తే మన జీవితంలో వాళ్ళ తోటి మాట్లాడము. వాళ్ళని ఇంక శత్రువుల కింద మనం చూస్తాం. రమణమహర్షి మంచివారు మనకు గురువులే, చెడ్డవారు కూడా మనకు గురువులే అన్నారు. మంచివాళ్ళు ఎలా అయినా గురువులే. వాళ్ళు మనకి మంచి మాటలు చెబుతారు. చెడ్డవాళ్ళు కూడా గురువులే. ఎందుచేత? మేము చేసే పనులు మీరు చూస్తున్నారు. అందుచేత మాదగ్గరకి మీరు రావద్దు అని చెప్పకుండా చెబుతున్నారు కాబట్టి చెడ్డవాళ్ళు కూడా మనకి గురువులే. అందుచేత వీళ్ళూ గురువులే, వాళ్ళూ గురువులే!

ఇక్కడ ఒక భక్తుడు అడిగే ప్రశ్న ఏమిటి అంటే నేను ఆత్మని అంటున్నారు కదా, మరి నాకు కోరిక ఎందుకు arise అవుతోంది? అని. అప్పుడు భగవాన్ ఏమి చెప్పారు అంటే నువ్వు ఆత్మవే, కానీ నువ్వు ఏమనుకుంటున్నావు? ఆత్మ అనుకోవట్లేదు, మనస్సు అనుకుంటున్నావు. అందుచేత కోరిక arise అవుతోంది అన్నారు. ఎంత బాగుందో చూడండి answer కూడా, నువ్వు ఆత్మవే, నువ్వు సత్యానివే, కానీ ఆత్మతో నీకు తాదాత్మ్యం లేదు, దేనితోటి తాదాత్మ్యం ఉంది? మనస్సుతోటి తాదాత్మ్యం పొందుతున్నావు. మనస్సుతోటి తాదాత్మ్యం పొందుతున్నావు కాబట్టి, మనసులో నుండి కోరిక వస్తోంది. ఇక్కడ గ్రహించవలసింది అది, వాడు ఆత్మని అని నోటితోటి చెబుతున్నాడు కానీ వాడు దేనితోటి identify అయ్యి ఉన్నాడు? Mind తోటే identify అయ్యి ఉన్నాడు. అందుచేత desire వస్తుంది.

శంకరాచార్యుల వారు ఆత్మ మిథ్య అని చెప్పలేదు, ఆత్మకి నువ్వు భిన్నంగా చూసేది

అంతా కూడా మిథ్యే అన్నారు. రూపదృష్టి, నామదృష్టి మిథ్యే! ప్రపంచం మిథ్య అంటే ఆత్మకి భిన్నంగా నువ్వు లోకాన్ని చూస్తే అది మిథ్య. అది ఇక్కడ అర్థం చేసుకోవాల్సింది. ఆత్మలో నీకు స్వతంత్ర్యమైన సుఖం, స్వతంత్ర్యమైన శాంతి ఉన్నాయి. అలౌకికమైన సుఖం, అలౌకికమైన శాంతి ఎక్కడ ఉంది? ఆత్మలో ఉంది. దానికి చావు లేదు, దానికి పుట్టుక లేదు. అది ఎవరు అయి ఉన్నావు? అది నీవు అయి ఉన్నావు. దేహం ఏ విధంగా అయితే నీకు నేనుగా వ్యక్తం అవుతుందో, మనస్సు ఏ విధంగా అయితే నీకు నేనుగా వ్యక్తం అవుతుందో, అలా ఆత్మ, ఆ సత్యవస్తువు నీకు నేనుగా వ్యక్తం అయినపుడు ఈ కోరికలు ఏమీ నీకు లేవు, అప్పటివరకు అవి నిన్ను వెంటాడుతాయి. ఏ వస్తువుకైతే కోరిక లేదో దానితోటి నీకు తాదాత్మ్యం వచ్చినప్పుడు కోరిక సమస్య లేదు. దానితోటి నీకు తాదాత్మ్యం లేదు కాబట్టి, నువ్వు కాని దానిని అవును అనుకుంటున్నావు కాబట్టి నీకు desire arise అవుతుంది.

రాగ ద్వేషాలని వదిలించుకోవడం ఎలాగా? రాగం ఉన్న చోట కామం ఉంటుంది, ద్వేషం ఉన్నచోట కోపం ఉంటుంది. కామక్రోధాలకి మరొక పేర్లే రాగద్వేషాలు. వీటిని ఎలా వదిలించుకోవాలి? రమణమహర్షి గారు ఏమి చెపుతున్నారు అంటే నీ శరీరానికి అయితే అరవై ఏళ్ళే ఉన్నాయి. ఈ రాగ ద్వేషాలకి కొన్ని వేల సంవత్సరాలు వయసు ఉంది. మేకు ఒకటి ఇక్కడ గుచ్చాము అనుకోండి, అది ధృఢంగా గుచ్చాము అనుకోండి తేలికగా లాగితే రాదు, ఎంత బలంగా లోపలకి ఉందో అంత బలంగా బయటకి లాగితేనే కానీ ఆ మేకు రాదు. అదే విధంగా రాగద్వేషాలు నీలో ఎంత లోతుగా, ఎంత బలంగా ఉన్నాయో అంత బలం తోటి బయటకి లాగితే అవి బయటకి వస్తాయి కానీ ఏదో నేను రామా అన్నాను ఒకసారి రాగ ద్వేషాల నుంచి విడుదల పొందలేదు అనుకుంటే కుదరదు. అవి ఎంత బలంగా ఉన్నాయో అంత బలంగా నువ్వు సాధన చేసి వాటిని తొలగించుకోవాలి. రాగద్వేషాలు ఈ శరీరం వచ్చిన తరువాత రాలేదు ఇంతకు ముందు నుంచి నువ్వు వాటిని ఎంజాయ్ చేశావు పూర్వజన్మల్లో, దేహం మారినా ఆ మానసిక కర్మ నీ కూడా వస్తుంది. వాటిని తొలగించుకోవడానికే సాధన. వస్తువు తెలుసుకోకుండా తలంపులు నీకు అడ్డు వస్తున్నాయి. మేఘాలు ఉన్నప్పడు సూర్యుడు ఉన్నాడు, మేఘాలు లేనప్పడు సూర్యుడు ఉన్నాడు. అయితే మేఘాలు ఉన్నప్పడు సూర్యుడు మనకి కనపడడం లేదు అంతే, అలాగని సూర్యుడు కంటే మేఘం గొప్పది కాదు, కానీ సూర్యుడిని కనపడకుండా చెయ్యడానికి మటుకి మేఘం ఉపయోగపడుతుంది. అలాగే మీలో ఉన్న నిజమైన వస్తువు కంటే రాగద్వేషాలు గొప్పవి కాదు. కానీ నీలో ఉన్న వస్తువు నీకు అనుభవంలోకి రాకుండా మటుకి

అడ్డు పడుతున్నాయి. వాటిని తొలగించుకోవడమే సాధన. నువ్వు జపం చేసినా, ధ్యానం చేసినా, విచారణ చేసినా వాటిని తొలగించుకోవడానికే.

రమణమహర్షి గారు చెప్పేది ఏమిటంటే విచారణా మార్గం. పూజ చేతులతోటి చేస్తాం, జపం నోటి తోటి చేస్తాం, ధ్యానం మనసు తోటి చేస్తాం, విచారణ మనసు తోటి చేస్తాం, ఇవన్నీ చిత్తశుద్ధి కోసం మనం చేస్తాం. ఏ మార్గం ద్వారా మీరు ప్రయాణం చేసినా చిత్తశుద్ధి కలగాలి. అంటే మనసుకి purification కావాలి. మీకు ఇష్టమైన మార్గంలోనే మీరు ప్రయాణం చెయ్యండి, పవిత్రత ముఖ్యం. నిజం అనేది ఒకటిగా ఉంటుంది కానీ రెండు గాను, మూడు గాను ఉండదు. రంగుల్లో తేడా ఉండచ్చు, కులాల్లో తేడా ఉండచ్చు, దేశాల్లో తేడా ఉండచ్చు, పరిసరాల్లో తేడా ఉండచ్చు, కానీ నిజం ఒక్కటే! మనకి చుట్టాలు, స్నేహితులు, పరిసరాలు ఇవి అన్నీ కర్మని బట్టి సిద్ధం అవుతాయి. మీకు అర్థం అవుతుందా? కర్మ తెగిపోతే ఈ సంబంధాలు కూడా మనకి తెగిపోతాయి. మీకు ఎప్పుడైనా సుఖం వచ్చే యోగం ఉంది అనుకోండి మీ ప్రారబ్ధ ఫలం బట్టి వచ్చేస్తుంది. మీకు కష్టం వచ్చే యోగం ఉంటే మీ తెలివి తేటలు ఆ కష్టాన్ని ఆపు చేయలేవు. మీకు అర్థం అవుతుందా? ప్రారబ్ధ ఫలాలు అవి. అవి ప్రారబ్ధ ఫలాలు అయితే, నా దేహం కూడా ప్రారబ్ధం ప్రకారం నడుస్తుంటే ఇంక నా జపం ఎందుకు? నా సాధన ఎందుకు? అని ఒక ప్లీడరు గారు భగవాన్‌ని అడిగారు. ప్లీడరులు అడిగే ప్రశ్నలు మనం అడగలేము. మనకంటే వాళ్లకి తెలివితేటలు ఎక్కువ ఉంటాయి. ఆయన ఏమి అడిగారు అంటే దేహం ఈ భూమి మీదకి ఏ పని నిమిత్తం వచ్చిందో, ఏది అనుభవించడానికి వచ్చిందో, అది అనుభవించిన తరువాత మరణిస్తుంది అంటున్నారు కదా, ఇంక మా సాధన ఎందుకు? మా జపాలు ఎందుకు? తీర్థ యాత్రలు ఎందుకు? నదుల్లో మునగడం ఎందుకు? గుళ్లు చుట్టూ తిరగడం ఎందుకు? ఈ గొడవ అంతా ఎందుకు అన్నారు ఒక ప్లీడరు గారు. మీకు అర్థం అవుతోందా? అప్పుడు ఆయన ఏమిచెప్పారు అంటే మీ ప్రారబ్ధాన్ని బట్టే మీకు సంతోషం వస్తూ ఉంటుంది, మీ ప్రారబ్ధాన్ని బట్టే మీకు దుఃఖం వస్తూ ఉంటుంది. కానీ సాధన ఏమి చేస్తుంది అంటే,



**రూప సౌందర్యం కాదు, గుణ సౌందర్యం ముఖ్యం. గుణ సౌందర్యం లేకుండా నీకు అమృతానుభవం కలుగదు.**

దానితోటి తాదాత్మ్యం పొందనివ్వదు. అలాగే మీకు ఏదైనా గర్వం వచ్చింది అనుకోండి మీరు సాధన చేస్తూ ఉంటే మీకు వచ్చిన గర్వం తోటి తాదాత్మ్యం పొందనివ్వదు. మీ దేహ ప్రారబ్ధం బట్టి కోపం వచ్చే యోగం ఉంది అనుకోండి, కోపం వస్తుంది మామూలుగా, కాని సాధనాబలం వలన ఆ కోపం తోటి తాదాత్మ్యం మీకు తగ్గిపోతూ ఉంటుంది. అంటే జరగవలసింది ఏదో జరుగుతుంది. రైటే అది, కానీ మీ సాధన యొక్క ప్రయోజనం, మీ భక్తి యొక్క ప్రయోజనం, మీ అన్వేషణ యొక్క ప్రయోజనం ఏమిటి అంటే దానితోటి మీకు తాదాత్మ్యం తగ్గిపోతూ ఉంటుంది అది సాధన యొక్క ప్రయోజనం.

ఒక్క బ్రహ్మము తప్పించి మిగతావి అన్నీ కర్మ సంబంధాలు. ప్రపంచంలో ఎన్నో గ్రామాలు ఉండగా, ఎన్నో దేశాలు ఉండగా మనం మురమళ్లలోనే పుట్టడం ఏమిటి? ఇంక ఊర్లు ఏమి లేవా? మీకు అర్థం అవుతోందా? ఇవి అన్నీ కర్మ సంబంధాలు. కర్మని బట్టి జన్మ వస్తుంది. ఈ కర్మ ఎవరికి? అహంకారానికే, జన్మ ఎవరికి? అహంకారానికే. అహంకారం మూలం కనుక తెలిస్తే, అహంకారాన్ని విచారణ చేసి దాని మూలాన్ని కనుక పట్టుకుంటే కర్మ లేదు, జన్మ లేదు అన్నారు రమణస్వామి. మోడరన్ మహర్షి, ఆ సబ్జెక్టు presentation లోనే wonderful technique, beautiful technique. కాష్ బేరమే కానీ అరువు బేరం అంటే ఆయనకి ఇష్టం ఉండదు. అదే భగవాన్ చెబుతూ ఉండేవారు శరీరం మరణించిన తరువాత ఏమవుతావో ఆ గొడవ నీకు ఎందుకు, ఇప్పుడు నువ్వు ఉన్నావు కదా, నువ్వు ఉన్నావు అన్న సంగతి నీకు తెలుస్తోంది కదా, శరీరం ఉండగా నువ్వు ఎవరో నీకు తెలియడం లేదు. ఇప్పుడు నువ్వు ఎవరవో నీకు తెలియనప్పుడు మరణించిన తరువాత ఏమవుతావో అన్న ప్రశ్న నీకు ఎందుకు అసలు? దీపం ఉండగానే చదువుకోని అబ్బాయి దీపం ఆరిపోయిన తరువాత చదువుకుంటాడా? దీపం ఉండగానే వాడు చదువుకోవడం లేదు, దీపం ఆరిపోయాక వాడు ఏమి చదువుకుంటాడు? మనం అందరం ఉన్నాం అన్న సంగతి మనకి తెలుస్తోంది కానీ మనం ఎవరమో మనకి తెలియడం లేదు. మనం ఎవరమో మనకి తెలిస్తే మనమే ఋషులం, మనమే జ్ఞానులం. తెలిస్తే వాడు దేవుడు అవుతాడు, తెలియకపోతే వాడు జీవుడు. నువ్వు ఎవరవో నీకు తెలిస్తే నువ్వు దేవుడు, నువ్వు ఎవరో నీకు తెలియకపోతే జీవుడు.

ఒక్క జ్ఞాని మాత్రమే నా స్వరూపం పొందుతాడు అని భగవద్గీతలో వాసుదేవస్వామి వారు కూడా చెప్పారు. స్వరూపం పొందడమే కాదు జ్ఞానికి, నాకు బేధం లేదు, వాడే నేను

వాడికి పెట్టే నమస్కారం నాకు కూడా అందుతుంది అని చెప్పాడు. ఎవడికైతే కర్తృత్వ బుద్ధి ఉందో వాడికి బేధ బుద్ధి వస్తుంది. బేధ బుద్ధి నశించాలి అంటే కర్త ఎవడో నశించాలి. ఈ కర్త ఎవడో నశిస్తేనే కానీ బేధ బుద్ధి నశించదు. బేధ బుద్ధి ఉన్నంతకాలం నీకు వికారం వస్తుంది, అనేక ఆకర్షణలకి నువ్వు లోబడతావు. ప్రపంచంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి, బేధ బుద్ధి ఉన్నవాడు ఏదో ఒక ఆకర్షణకి లోబడతాడు. అన్ని ఇంద్రియాలకి లోబడక్కర్లేదు మనం ఒక్క ఇంద్రియానికి లోబడినా పతనం అయ్యిపోతాం. ఒక్క విషయానికి లోబడినా పతనం అయ్యిపోతాం. నీ మనస్సుని నువ్వు బాగు చేసుకో, నీ మనస్సుని నువ్వు బాగు చేసుకుంటే నీ మనస్సే నీకు మిత్రుడిగా పని చేస్తుంది. నీ మనస్సుని నువ్వు పాడు చేసుకోకు. నీ మనస్సుని నువ్వు పాడు చేసుకుంటే నీ మనస్సే నీకు శత్రువుగా పని చేస్తుంది. ఇది భగవంతుడు చెబుతున్నాడు. ఇవన్నీ మన మనస్సు బాగు చేసుకోవడానికే. పూజ, జపం, ధ్యానం, విచారణ. ధ్యానానికి, విచారణకి చాలా తేడా ఉంది. చాలామంది అడుగుతున్నారు ఏవండీ ధ్యాన మార్గమే కదా రమణస్వామి చెప్పింది అని, రమణమహర్షి గారు ధ్యాన మార్గాన్ని కాదు అనలేదు. ధ్యానం చేసేవాడిని చెయ్యమన్నారు, జపం చేసే వాడిని చెయ్యమన్నారు, ఆయన చెప్పవలసింది ఏదో చెప్పారు కానీ ఆయన కాలంలో ఉన్న విషయాన్ని ఆయనేమి ఖండించలేదు. ఆయన మనకి నేర్పటానికి వచ్చారు కానీ ఖండించడానికి రాలేదు. ధ్యానం మనస్సే చేస్తుంది. విచారణ మనస్సే చేస్తుంది. మీకు రాముడు అంటే ఇష్టం అనుకోండి, లేకపోతే కృష్ణుడు అంటే బాగా ఇష్టం అనుకోండి, శివుడు అంటే బాగా ఇష్టం అనుకోండి, రామకృష్ణుడు అంటే బాగా ఇష్టం అనుకోండి, మీరు ఇష్టమైన అవతారపురుషుడినిగానీ, గురువునుగానీ తీసుకుని నిరంతరం చింతించటం ధ్యానం. ఇలా ఏక వస్తువును చింతించటం వలన కూడా మనస్సు నశిస్తుంది. విచారణా మార్గం వేరు. మనస్సును ఒక వస్తువు మీద నిలబెట్టి ఉంచటం ధ్యానం. మనస్సు యొక్క మూలాన్ని వెతకటం విచారణా మార్గం.

మీకు మనస్సు అనేది ఒకటి ఉంది. అది లేకపోయినా అది ఉంది అని నువ్వు అనుకుంటున్నావు. దానితోటి తాదాత్మ్యం పొందడం వల్ల నువ్వు అది ఉందని అనుకుంటున్నావు. మనకు ఏ తలంపు వస్తే అది ఒక్కటే నిజం అనుకుంటాం. ఏదైనా కోపం వచ్చింది అనుకోండి మనకి ఇంక ఏదీ కనపడదు. అది ఒక్కటే నిజం అనిపిస్తుంది. మనకి ఎప్పుడైనా కామం వచ్చింది అనుకోండి ఇంకేమి ప్రపంచం కనపడదు అది ఒక్కటే నిజం అనిపిస్తుంది. ఎవరి మీద అయిన ద్వేషం వచ్చింది అనుకోండి, అది ఒక్కటే నిజం అనిపిస్తుంది. మనకు ఏ తలంపు అయితే వచ్చిందో ఆ తలంపుతో మనం identify అయిపోతాం. అది ఒక్కటి మాత్రమే

నిజం, ఇంకేమి నిజం కాదు అని అనిపిస్తూ ఉంటుంది. ఈ బలహీనత మనలో ఉంది. అంటే మనలో ఆర్భాటం ఎక్కువ, ఆలోచన తక్కువ. జనరల్‌గా ఆలోచన లోతుగా ఉన్న వాళ్లకి ఆర్భాటం తక్కువగా ఉంటుంది. ఆర్భాటం ఎక్కువగా ఉన్న మనుషుల్లో ఆలోచన తక్కువగా ఉ ంటుంది. మనో మూలాన్ని వెతకడమే విచారణా మార్గం. మనో మూలాన్ని వెతకడం వల్ల కూడా మనస్సు నశిస్తుంది. ఏక వస్తువుని ధ్యానించడం వల్ల కూడా మనస్సు నశిస్తుంది. విచారణా మార్గం ప్రయోజనం కూడా మనో నాశనానికే, ధ్యాన మార్గం యొక్క ప్రయోజనం కూడా మనో నాశనానికే. మనకి అనేక తలంపులు వస్తున్నాయి, ఈ తలంపులు ఎవరికి అని మనం ప్రశ్నించుకోవాలి. ఈ తలంపులు అన్నీ ఎవరికి వస్తున్నాయి? నేనుకి వస్తున్నాయి. మనం కనిపించిన ప్రతీవాడిని నువ్వు ఎవడవు అని అడుగుతాం కానీ నన్ను నేను, నేను ఎవడను అని అడగను. మీకు అర్థం అవుతోందా? ఎవరైనా కనిపిస్తే మీరు ఎవరు, మీరు ఎవరు అని అడుగుతాను. కానీ నేను అనే తలంపు నాకు ఉంది. కనిపించిన వారినల్లా నువ్వు ఎవరవు, నువ్వు ఎవరవు అని అడిగే బదులు ఈ నేనుని మనం ప్రశ్నించుకోవడం మంచిది. కోపం వస్తుంది మనకి , చిరాకు వస్తుంది, ఈ చిరాకు ఎవరికి వస్తుంది అంటే నాకు వస్తుంది, అంటే ఈ నేనుకి వస్తుంది. ఈ చిరాకు వచ్చే ఈ నేను ఎవరు? ద్వేషం వచ్చే ఈ నేను ఎవరు? ఈ up and downs వచ్చే ఈ నేను ఎవరు? అని మీరు ప్రశ్నించుకోవడం వలన అది ఉపసంహరించబడుతుంది.

ఒక సాధువు గారు రమణమహర్షి గారిని అడిగారు మోక్షానికి ఎలా వెళ్లమంటారు అని, వచ్చిన దారిన వెళ్లిపోతే నీకు మోక్షం వచ్చేస్తుంది అని చెప్పారు. ఇప్పుడు మీరు అందరూ వచ్చిన దారిన వెళ్లిపోతే ఎక్కడకి వెళ్లిపోతారు? మీ ఇంటికి వెళ్లిపోతారు. అదే విధంగా నువ్వు వచ్చిన దారిన వెళ్లిపోతే మోక్షం వచ్చేస్తుంది అన్నారు. నీకు ఈ నేను అనే తలంపు వచ్చిన తరువాత ఇతర తలంపులు వచ్చాయి, మనస్సు వచ్చింది, మనస్సు వచ్చాక దేహం వచ్చింది, దేహం వచ్చాక ప్రపంచం వచ్చింది. మీకు అర్థం అవుతోందా? మనసు లేనివాడికి దేహం లేదు, దేహం లేనివాడికి ప్రపంచం లేదు. మనసు ఎక్కడ నుంచి వస్తుంది? నేను అనే తలంపు నుంచి వస్తుంది. ఆ నేను అనే తలంపు ఎక్కడ నుంచి వస్తుంది? బ్రహ్మం నుంచి వస్తుంది. అక్కడికి వెళ్లిపోతే అది నీ సొంత ఇల్లు. స్వామీజీ అనేవారు ఓ మనసా నీ సొంత ఇంటికి వెళ్లిపోఅని, అంటే మన సొంత ఇంటికి మనం వెళ్లేవరకు ఈ జన్మలు మనకు తప్పవు. మన సొంత ఇల్లు ఎక్కడుంది? మన హృదయంలో ఉంది. ఏ మార్గం ద్వారా ప్రయాణం చేసినా మనసుని హృదయం దగ్గరకి పంపాలి. అంటే దాని

పుట్టు చోటు అది చూస్తేనే కానీ అది నశించదు. మనస్సు ఎక్కడైతే జన్మిస్తుందో దాని జన్మస్థలం చూస్తేనే కానీ అది నశించదు.

ఈ నేనుని పోగొట్టుకోవడం ఎవరికీ ఇష్టం ఉండదు. ఈ నేనుని పోగొట్టుకోవడం ఎందుకు ఇష్టం ఉండదు అంటే ఆ నేను నువ్వే అనుకుంటున్నావు కాబట్టి. అందుచేత రమణమహర్షి గారు చెప్పేవారు అందరూ గజ ఈతగాళ్ళే ఎవరూ గజం కదలడం లేదు అని, అందరూ గజ ఈతగాళ్ళే, అందరూ మాకు ఈత బాగావచ్చు అంటున్నారు తీరా ఈత మొదలు పెట్టమంటే ఎవడూ గజం కదలడం లేదు. నేను సాధన చేస్తున్నాను, నేను సాధన చేస్తున్నాను అని ఈ సాధన చేసేవారు అందరూ నేనుని మినహాయించేస్తున్నారు. పోగొట్టుకోవలసింది ఈ నేనునే కానీ ఆ నేనుని మినహాయించి సాధనలు చేస్తున్నారు. మీ సాధనలో ఆ నేనుని involve చెయ్యాలి. ఆ నేనుని involve చెయ్యకుండా, ఆ నేనుని separate చేసి ఊరికే సాధన చేస్తున్నాం, సాధన చేస్తున్నాం అంటే కాదు. మీరు చేసే సాధన వల్ల మొట్టికాయలు తగలవలసింది ఆ నేనుకే, మాయ అంతా ఎక్కడ ఆంది? ఆ నేనులోనే ఉంది. రమణమహర్షి గారు చెప్పేవారు నాది విడిచి పెడితే చిత్తశుద్ధి కలుగుతోంది, నేనుని విడిచి పెడితే మోక్షం కలుగుతోంది అని. ఈ తుండు నాది నాది అంటున్నాను, ఈ నాదిని ఇస్తే ఏమి కలుగుతోంది? చిత్తశుద్ధి కలుగుతోంది. నేనుని ఇస్తే ఏమి కలుగుతోంది? వాడు జ్ఞాని అయిపోతాడు. మీకు అర్థం అవుతోందా? దేవుడు ఏమి చెబుతున్నాడు అంటే నీ తెలివి తేటల వల్ల, నీ ప్రయత్నం వల్ల, నీ సాధన వల్ల, నీ విచారణ వల్ల, నువ్వు ఆ నేనును పోగొట్టుకోవడానికి ప్రయత్నం చెయ్యి. దానిని పోగొట్టుకోవడానికి ప్రయత్నం చేసి నీ సాధన నువ్వు చేసుకో, అది జ్ఞాన మార్గం. నీ అంతట నువ్వు కృషి చేసి ఆ నేనుని పోగొట్టుకోడానికి నువ్వు ప్రయత్నం చేస్తే అది జ్ఞాన మార్గం. నువ్వు పోగొట్టుకోలేకపోతే ఈ personal "I"ని, ఈ individual "I"ని, దేవుడికి ఇవ్వడానికి మనం ప్రయత్నం చేస్తే అది surrender మార్గం. శరణాగతి పొందిన వాడికి కోరికలు ఉండవు. కోరికలు ఎక్కడ ఉన్నాయి? మనసులో ఉన్నాయి. ఆ మనసుని పట్టుకెళ్ళి ఎవడైతే దేవుడికి ఇచ్చేశాడో వాడికి కోరికలు ఉండవు. ఏ వస్తువులో అయితే కోరికలు ఉన్నాయో, దానిని దేవుడికి సరెండర్



**ఫలకాంక్ష లేకుండా పనిచేస్తూ ఉంటే నువ్వు సంసారంలో ఉన్నా సన్యాసితోటి సమానం.**

చేశాడు కాబట్టి వాడికి కోరికలు ఉండవు.

భక్తి మార్గంలో నువ్వు పోగొట్టుకోవాల్సింది నీ అహంభావననే, జ్ఞాన మార్గంలో నువ్వు పోగొట్టుకోవాల్సింది నీ అహంభావననే, ధ్యాన మార్గంలో నువ్వు పోగొట్టుకోవలసింది నీ అహంభావననే, కర్మ మార్గంలో పోగొట్టుకోవలసింది అహంభావననే, మీరు బాగా అర్థం చేసుకోవాల్సింది అది. అదే మనకి అడ్డుగా వస్తుంది. మనకి లోపల వస్తువు ఎంత సన్నిహితంగా ఉన్నప్పటికీ, ఈ ఆనంద సముద్రం, ఈ శాంతి సముద్రం, మనకి ఎంతో సన్నిహితంగా ఉన్నప్పటికీ అది మనకి అనుభవంలోకి రాకుండా అడ్డుపడేది మన నేనే, ఈ wrong "I" నే నువ్వు right "I" అనుకుంటున్నావు. ఇప్పుడు నీకు వ్యక్తం అయ్యే నేను wrong "I" అని నీకు అర్థం అయితే దానిని eliminate చేసుకోవడానికి నువ్వు ప్రయత్నం చేస్తావు. అర్థం కాకపోతే దానిని eliminate చేసుకోవడానికి కూడా నువ్వు ప్రయత్నం చెయ్యవు. అసలు ప్రయత్నం అంటూ మొదలుపెడితే తరువాత నువ్వు success అవుతావో, లేదో వేరే విషయం. నువ్వు కనీసం శ్రవణం చెయ్యడం వలన, ఏది wrong "I"? ఏది right "I"? అనే విషయం నువ్వు శ్రవణం చెయ్యడం వల్ల, wrong "I" ని తొలగించుకోవడానికి నువ్వు ప్రయత్నం చేస్తావు. నువ్వు శ్రవణం చెయ్యకపోతే ప్రయత్నం చెయ్యాలి అనే బుద్ధి కూడా నీకు కలగదు. దైవానుగ్రహం మనకి లేకుండా దేవుడిని తెలుసుకోవాలి అనే బుద్ధి కూడా మనకి కలగదు. మనకి దేవుడిని తెలుసుకోవాలి అనే బుద్ధి కలుగుతోంది అంటే అది మన గొప్ప కాదు అది ఆయన అనుగ్రహం.

దేవుడిని తెలుసుకోవాలి అనే సంకల్పం మనకి కలుగుతోంది అంటే అది మన తెలివితేటలు కాదు ఆయన అనుగ్రహమే. ఆయన అనుగ్రహం లేకపోతే ఆయనని తెలుసుకోవాలి అనే బుద్ధి కూడా మనకి కలగనే కలగదు. మనకు నేనుగా వ్యక్తం అయ్యేది ఈ దేహం కాదు, ఈ దేహమే కనుక నేనుగా వ్యక్తం అవుతుంటే ఏ శవం కూడా స్మశానానికి వెళ్లదు. స్మశానానికి తీసుకు వెళుతుంటే శవం ఊరుకోదు కూడా, నేను అని ఈ దేహం అనటం లేదు, నేను అని ఎవరు అంటున్నారు? మనసు అంటుంది. ఈ దేహం నాది, ఈ కన్ను నాది, ఈ ముక్కు నాది, అని ఎవరు అంటున్నారు? లోపల మనస్సే చెబుతుంది. నేనుగా వ్యక్తం అయ్యేది మనస్సే. దేహం నేనుగా వ్యక్తం అవ్వటం లేదు. మనస్సు నేనుగా వ్యక్తం అవుతుంది. ఆ మనస్సు నశించటం వల్ల మీరు పోరు. మీరు ఎవరో మీకు తెలుస్తుంది. wrong "I" ని ఎప్పుడైతే మీరు పోగొట్టుకున్నారో అప్పుడు right "I" మీకు వ్యక్తం అవుతుంది.

వైకుంఠంలో ఉన్న నారాయణుడే, కైలాసంలో ఉన్న శివుడే మీకు నేనుగా వ్యక్తం అవుతాడు. universeని ఏ energy అయితే నడుపుతుందో, ఆ ఎనర్జీయే మీకు నేనుగా వ్యక్తం అవుతుంది. మీరు వెతికే వస్తువు, మీరు అన్వేషించే వస్తువు మీ హృదయంలోనే ఉంది. మనస్సు నశించిన వెంటనే మీరు నశిస్తారు అనుకోవద్దు. హృదయంలో ఉన్న సత్యవస్తువే నీకు నేనుగా వ్యక్తం అవుతుంది.

"మీకు ముద్దు, ముచ్చట లేవు. భారతంలో కథలు లేవు, భాగవతంలో కథలు లేవు, రామాయణంలో కథలు చెప్పటం లేదు, వచ్చిన వాడినల్లా నువ్వు ఎవరివో తెలుసుకో అంటున్నారు, ఎవరిని తెలుసుకోమంటారు?" అని ఒక ప్లీడరు గారు భగవాన్‌ను అడిగారు. అప్పుడు భగవాన్ "నువ్వు ఎవరిగా ఉంటున్నావో వాడిని తెలుసుకో" అన్నారు. "నువ్వు ఎవరిగా ఉన్నావు? ఆత్మగా ఉన్నావు కానీ దానికి సంబంధించిన అనుభవం నీకు లేదు. అందుచేత దానిని తెలుసుకోమని అడుగుతున్నాను. నువ్వు దేహం అనుకున్నప్పుడు అదే నువ్వు, మనసు అనుకున్నప్పుడు అదే నువ్వు, నీకు అనుభవంలో ఉన్నా, అనుభవంలో లేకపోయినా అదే నువ్వు. అందుచేత నువ్వు ఎవరిగా ఉన్నావో వాడిని తెలుసుకోమని అడుగుతున్నాను" అన్నారు. అప్పుడు ఆ ప్లీడరు "చదువుకున్నవాడు వచ్చాడు అనుకోండి నువ్వు ఎవరవో తెలుసుకో అంటారు, చదువు లేనివాడు వచ్చాడు అనుకోండి వాడిని నువ్వు ఎవరవో తెలుసుకోమంటారు. చదువుకున్నవాడికి, చదువు లేని వాడికి ఒక్కటే మంత్రమా?" అన్నారు. అప్పుడు ఆ ప్లీడరు గారి తోటి రమణమహర్షి గారు "చదువులేని వారందరికీ అబద్ధాలు చెప్పి, చదువుకున్న వారికి నిజం చెప్పమంటావా? నువ్వు అబద్ధాలు చెప్పమంటే చెబుతాను మళ్ళీ ఇంతవరకు నేను చెప్పినవి అన్నీ అబద్ధాలు అని నా నోటితోటి నేనే చెప్పాలా. చదువుకున్న వాళ్లకి నిజం చెప్పమంటావా? చదువులేని వాళ్లకి అసత్యం చెప్పమంటావా? ఇదయ్యా నువ్వు చెప్పేది?" అని అన్నారు.

రమణమహర్షి గారి దగ్గరకి ఒక తమిళ పండితుడు ఆయన మీద తమిళంలో ఏదో ఐదు పద్యాలు రాసుకుని వెళ్ళారు. ఆ తమిళ పండితుడు నాకు స్వయంగా చెప్పిన మాట ఇది. 1946-47 ఆ ప్రాంతంలో, ఆయన తమిళంలో పద్యాలు రాసుకుని వెళ్లి నువ్వు కుమారస్వామి అవతారం, హృదయనివాసి నువ్వు, జ్ఞాన మార్గం ఉద్ధరించడానికి, మరుగున పడిపోయిన జ్ఞాన మార్గాన్ని ఆవిష్కరించడానికి, కుమారస్వామి అయిన నువ్వే ఇక్కడకు వచ్చావు. కానీ నీ భార్య అయిన వల్లీ దేవిని నువ్వు తీసుకు రాలేదు. నీ వాహనం అయిన నెమలిని తీసుకు

రాలేదు, ఎవరూ లేకుండా నువ్వు ఒక్కడివే వచ్చేశావు, కుమారస్వామివి ఈ రూపంలో వచ్చావు, ఏదో కాళ్ళు, చేతులు తొడుగుకుని వచ్చావు నువ్వు ఇలాగ, నడుస్తున్న దేవుడివి నువ్వు, నా కళ్లకి కనిపిస్తున్న దేవుడవు, ఇలా ఐదు పద్యాలు రాసుకుని ఆయనని వర్ణించి చెప్పారు. ఎవరి తోటి? రమణమహర్షి గారి తోటి, మంత్రులు సంతోషించినట్టు ఆయన కూడా సంతోషిస్తారు అనుకున్నాడు ఈ రచయిత. మనం మంత్రికి సన్మానాలు చేసినప్పుడు కూడా పద్యాలు రాసిస్తూ ఉంటాం. వాళ్ళు మహాత్ములు కాకపోయినా మీరు మహాత్ములు, గొప్పవారు అని వాళ్లని పొగుడుతూ రాస్తాము. ఎందుకు అంటే వాళ్ళు సంతోషిస్తారు అని. కానీ ఇక్కడ ఆ రచయిత రాసింది నిజమే, కానీ భగవాన్ అన్నారు నేను చాలా గొప్పవాడిని అని రాశావయ్యా నువ్వు, నేను అవతారపురుషుడిని అని రాశావు నువ్వు, నేను అవతారపురుషుడిని అయితే నీకు ఏమి కలిసి వస్తుంది? నేను గొప్పవాడిని అయితే నీకు ఏమి కలిసి వస్తుంది? నువ్వు బాగుపడే విధానం నువ్వు చూసుకో అన్నారు. వాడు రమణమహర్షి అంటే! ఈయన రాసిన దానికి ఆయనేమి సంతోషించలేదు, ఏనుగు ఎక్కి కూర్చున్నట్టు అనిపించలేదు. నేను గొప్పవాడిని అంటున్నావు, పోనీ అనుకో మాటవరసకి, నీకు ఏమికలిసివస్తుంది? అమలాపురం స్టేట్ బ్యాంకులో వంద కోట్లు ఉన్నాయి, నీ జేబులో రూపాయి లేదు, ఎందుకు ఈ గొడవ? అమలాపురం స్టేట్ బ్యాంకులో ఉన్న డబ్బు నీకు ఏమైనా వస్తుందా? నీ జేబులో ఉన్న రూపాయి నువ్వు అనుభవించవచ్చు. నేను గొప్పవాడిని అయితే నీకు ఏమికలిసివస్తుంది? నువ్వు బాగుపడడానికి ప్రయత్నం చెయ్యి, నిన్ను ఉద్ధరించుకోడానికి నువ్వు ప్రయత్నం చెయ్యి, నువ్వు purify అవ్వడానికి ప్రయత్నం చెయ్యి, నీ హృదయంలో లేనిది నా హృదయంలో ఏమీ లేదు. రమణమహర్షి చాలా గొప్పవాడు అని చెబితే ఏమిటి నీకు కలిసివచ్చేది? నువ్వు బాగుపడడానికి నువ్వు ప్రయత్నం చెయ్యి అని చెప్పారు.

ఆయన రూపాన్ని మనం సపోర్ట్‌గా తీసుకోవచ్చు, ఆయన సందేశాన్ని మనం సపోర్ట్‌గా తీసుకోవచ్చు, కానీ ప్రయాణం చేయవలసింది నువ్వే. నీ అంతట నువ్వే బాగుపడాలి. మనం మాట్లాడే మాట, మన చేత, మన చూపు ఇవన్నీ కూడా అహంభావం తొలగించు కోవడానికి అనుకూలంగా ఉండాలి. కొంతమంది మాట్లాడితేనే అహంభావం కోసం మాట్లాడతారు. వాళ్ళకి ఏదైనా గౌరవం వచ్చింది అంటే గౌరవం ఎవరికి? అహంభావనకి. అగౌరవం ఎవరికి? అహంభావనకి. గౌరవం వస్తుంది అంటే పని చేస్తాడు. గౌరవం రాదు అంటే పని చేయడు. అందుచేత నువ్వు చేసే పని నీ అహంభావం తగ్గడానికి అనుకూలంగా ఉండాలి. కొంతమంది గొప్ప మాటలు మాట్లాడుతూ ఉంటారు. కొంతమందికి

రెండో పని ఉండదు ఆత్మస్తుతి, పరనింద. వాళ్ళని వాళ్ళు పొగుడుకోవడం, ఎదుటివారిని విమర్శించటం. దీనివల్ల ఏమి పెరిగిపోతుంది? అహంభావన పెరిగిపోతుంది.

రమణమహర్షి గారు చెప్పినటువంటి most secret విషయం ఏమిటి అంటే, నీ దేహానికి food అందుతోంది అందుకే మనం ఇలా ఉన్నాం, ఎంత బాగున్నామో చూడండి మనం. మన bodies అన్నీ కూడా బగా తింటున్నాయి. ఒక నలభై రోజులు, ముప్పై రోజులు తినడం మానేశాము అనుకోండి దేహం ఏమవుతుంది? కృశించిపోతుంది. ఇంకో పది రోజులు తినడం మానేస్తే దీనిని తీసుకెళ్ళి స్మశానంలో పడేస్తారు. దేహానికి food అందడం వల్ల ఈ దేహం అలా ఉంది. నీ దేహం నిన్ను ఏమి ఇబ్బంది పెట్టటం లేదు. నీకు మోక్షం రాకుండా నీ దేహం అడ్డు రావటం లేదు. ఎవరు అడ్డు వస్తున్నారు? నీ అహంభావన అడ్డు వస్తోంది. అందుచేత అహంభావనకి supply అయ్యే food కట్ చెయ్యి. దేహం ఏమి చేస్తుంది? కూర్చోమంటే కూర్చుంటుంది, నడవమంటే నడుస్తుంది. పని చేయమంటే చేస్తుంది, వద్దంటే మానేస్తుంది. దేహం జడం, జడం కాబట్టి స్మశానంలో పడేస్తుంటే నన్ను ఎందుకు ఇలా పడేస్తున్నారు, నన్ను ఎందుకు కాలుస్తున్నారు అని అడుగుతోందా పాపం? ఒక్క శవం అడుగుతోందా నన్ను ఎందుకు ఇలా కాల్చేస్తున్నారు? నన్ను ఇంటికి తీసుకుపోండి అని అడుగుతోందా? అడగడం లేదు. దేహం బయట తొడుగు. ఈ పుస్తకం ఉంది అనుకోండి, దానిని నేను కింద పడేస్తాను అనుకోండి నన్ను కింద ఎందుకు పడేశావు అని అడుగుతోందా? అడగదు, జడవస్తువు కాబట్టి, మనం ఉపయోగించుకోవడంలో ఉంటుంది అంతే, దేహం కూడా జడవస్తువే!

భగవాన్ మనకి చెప్పే పాయింట్ ఏమిటి అంటే, నీ అహంభావనకి food ఎక్కడ నుంచి supply అవుతుందో నువ్వు చూసుకోవాలి. ఎవరైనా నిన్ను పొగిడారు అనుకో, నీకు గర్వం వచ్చింది అనుకో నీ అహంభావనకి foodsupply అయిపోతుంది. మిమ్మల్ని ఎవరైనా తిట్టారు అనుకోండి మీ మనస్సు కృంగిపోతుంది. ఇంతకీ మీరు సాయంత్రం ఇంటికి వెళ్ళిన తరువాత ఇంత ఆలస్యంగా ఇంటికి వచ్చావు వంట ఎప్పుడు చేస్తావు అని మీ అత్తగారు,



**ఇతరులకు మనం ఏది ఇస్తే**

**అదే మనకు తిరిగి వస్తుంది.**

మామగారు పట్టుకుని తిట్టారు అనుకోండి పాపం ఈ చెప్పినదంతా మర్చిపోతారు మీరు. ఆ తిట్లు అన్నీ మీకు జ్ఞాపకం వస్తాయి. ఇంకరాత్రి నిద్ర పట్టదు మీకు, ఆ తిట్లకి బాధపడేది ఎవరు? మీ అహం భావనే. ఇది బాగా అర్థం చేసుకోండి. ఎవరైనా పొగిడితే మీకు సంతోషం వస్తే అది మీ అహంభావనకే, అంటే దానికి foodsupply అవుతుంది. మీరు నిర్వికారంగా ఉంటే ఫర్వాలేదు. ఆ పొగడ్త వల్ల మీ మనసులో వికారం వస్తే అహంభావనకు foodsupply అయ్యిపోతుంది. అదే విధంగా ఎవరైనా తిడితే మీరు కృంగిపోతారు అనుకోండి దానివల్ల కూడా foodsupply అవుతుంది. రమణమహర్షి గారు చెప్పేది ఏమిటి అంటే అహంకారానికి foodsupply అవ్వకుండా చూసుకోండి. అప్పుడు దానంతట అదే రాలిపోతుంది. మీరు అన్నం తినకుండా ఉంటే ఒక యాభై రోజులకో, అరవై రోజులకో మీ శరీరం ఏ విధంగా అయితే మరణిస్తుందో, అలాగే మీ అహంభావనకి సాధ్యమైనంత వరకు foodsupply కట్ చేస్తుంటే, ఈ జన్మలోనే, ఇప్పుడే, ఇక్కడే, ఎప్పుడో కాదు ఈ శరీరం మరణించక ముందే, ఈ శరీరం స్మశానానికి వెళ్ళక ముందే, లోపల ఉన్నటువంటి వస్తువు, సత్యదార్థం, లోపల ఉన్న పరమేశ్వరుడు నీకు నేనుగా వ్యక్తం అవుతాడు. ఎప్పుడో కాదు, ఎక్కడో కాదు, ఇప్పుడే, ఇక్కడే, ఈ దేహం మరణించక ముందే, నీ అహంభావనకి foodsupply నువ్వు cut చెయ్యగలిగితే, ఈ అహంభావనని నాశనం చెయ్యగలిగితే, అహంభావన యొక్క మూలాన్ని నువ్వు తెలుసుకోగలిగితే వేరుతో సహా దానిని పెకలించి బయటకి తీసుకొచ్చి దానిని మంట పెట్టగలిగితే ఇప్పుడే, ఇక్కడే, ఈ దేహం ఉండగానే, ఈ bodyburn అవ్వకముందే నీకు లోపల ఉన్నటువంటి సత్య పదార్థం వ్యక్తం అవుతుంది. ఇది కాష్ బేరమే అరువు బేరం కాదు.

మనకి ego-sense ఎక్కువ, common-sense తక్కువ. Ego-sense పెరుగుతుంటే common-sense తగ్గుతుంది. common-sense పెరుగుతూ ఉంటే ego-sense తగ్గుతూ ఉంటుంది. ఎప్పుడైతే ego-sense నాశనం అయ్యిందో, ఆత్మని పొందటం అంటూ లేదు, అది లేని క్షణం అంటూ లేదు, ఆత్మ లేకుండా ఒక్క క్షణం అంటూ నువ్వు లేవు. ఈ దేహం నీకు కనిపిస్తుంది. గాఢనిద్రలో ఈ దేహం ఎక్కడ ఉందో నీకు తెలియదు. ఈ దేహం లేకుండా, ఈ చుట్టాలు గొడవ లేకుండా, లోకం గొడవ లేకుండా, గాఢనిద్రలో ఎన్నో గంటలు నువ్వు గడిపేస్తున్నావు. ఆత్మని విడిచి పెట్టి ఒక్క క్షణం కూడా నువ్వు లేవు. నువ్వు నిద్రపోతున్నప్పటికీ నీలో ఉన్న చైతన్యం నిద్రపోవటం లేదు. మెలకువ వచ్చిన తరువాత అందరూ చెబుతారు రాత్రి నాకు చాలా బాగా నిద్ర పట్టింది అని, అంటే గాఢనిద్రలో నువ్వు పడుకున్నప్పటికీ నీ నిద్రను

చూసేవాడు ఒకడు ఉన్నాడు. వాడు ఇప్పుడు జాగ్రదావస్థలో కూడా ఉన్నాడు, వాడు ఎక్కడకి పారిపోలేదు. వాడి పిలక కనుక నువ్వు పట్టుకుంటే ఇక్కడే నువ్వు తరిస్తావు.

రమణమహర్షి గారు చెబుతూ ఉంటారు నిద్రావస్థలో ఉన్న సుఖం, జాగ్రదావస్థలో ఉన్న ఎరుక, simultaneousగా ఒకేసారి ఎవడైతే అనుభవిస్తున్నాడో, వాడు జ్ఞాని. అది నీళ్ళు కలిపిన పాలు లాంటిది కాదు పొదుగు కాడ పాలు లాంటిది. ఆత్మ సుఖం, ఆత్మ శాంతి ఎటువంటిది అంటే పొదుగు దగ్గర పాలు ఎంత ఫ్రెష్‌గా ఉంటాయో, ఆత్మ శాంతి, ఆత్మ సుఖం అటువంటిది. నీకు నిద్రలో సుఖం ఉంది కానీ ఎరుక లేదు. జాగ్రదావస్థలో నీకు ఎరుక ఉంది కానీ సుఖం లేదు. జాగ్రదావస్థలోని ఎరుక, నిద్రలోనిసుఖం, ఒకేసారి నీ అనుభవంలోకి రాగలిగితే అది నీ కడసారి జన్మ, మళ్ళీ నువ్వు శవాలను మొయ్యక్కర్లేదు. అంటే నువ్వు పుట్టక్కర్లేదు. ఆ స్థితిని కనుక ఈ జన్మలో నువ్వు achieve చెయ్యగలిగితే ఇంక ఈ శవాల మోత నీకు ఉండదు. అందుచేత అది లేని క్షణం అంటూ లేదు. నీ దేహం లేని క్షణం, నీ కామ క్రోధాలు లేని క్షణాలు, నీ మనసులో గొడవలు లేని క్షణాలు అనేకం ఉన్నాయి. నీ గాఢనిద్రలో ఈ గొడవలు ఏమీ లేవు నీకు. Mind యొక్క stuff, mind create చేసే stuff ఏమీ లేదు నీకు గాఢనిద్రలో, కానీ ఆత్మ లేని క్షణం అంటూ లేదు. దేహం లేని క్షణాలు ఉన్నాయి, మనస్సు లేని క్షణాలు ఉన్నాయి, కామ క్రోధాలు లేని క్షణాలు ఉన్నాయి కానీ ఆత్మ లేని క్షణం అంటూ లేనే లేదు, అది ఎప్పుడూ ఉంది, అది సదా ఉంది, అన్ని కాలాల్లోనూ ఉంది, అన్ని అవస్థల్లోనూ ఉంది. అది లేని క్షణం అంటూ లేదు. నువ్వు ఉన్నట్టే ఉండు, మనకి ఎలాగ ఉండడం తప్పదు. మన శరీరం ఎక్కడో మురమళ్లలోనో, ముమ్మడివరంలోనో, కాకినాడలోనో ఈ శరీరం బ్రతికి ఉన్నంతకాలం ఎక్కడో ఒక చోట ఉండాలి. దీనికి అత్తారింటిదగ్గరో, పుట్టింటిదగ్గరో లేకపోతే మరొక చోటో శరీరం బ్రతికి ఉన్నంత కాలం ఏదో నాలుగు మెతుకులు పెడుతూ ఉండాలి. రోజు పొద్దున్నే స్నానం చేయించాలి, మొఖం కడుగుకోవాలి, తలదువ్వి నూనె రాసుకుంటూ ఉండాలి. శవానికి చాలా చాకిరీ చెయ్యాలి మనం. దీనికి ఏదైనా రోగం వస్తే ఆసుపత్రికి తోలుకుని వెళ్ళాలి. మనకి ఇష్టమున్నా, లేకపోయినా ఈ దేహానికి చాకిరి చేస్తూ ఉండాలి. చేసినంత కాలం చాకిరీ చేశాం, పోనీ ఈ రోజున చావు వచ్చింది ఇంక దానితోటి ఇబ్బంది లేదు అనుకోము. చావు వస్తే మళ్ళీ భయం వేస్తుంది చావు అంటే ఇంకా బ్రతకాలి అనిపిస్తుంది. ఎందుచేత? నువ్వు చావు లేనివాడివి కాబట్టి.

రమణమహర్షి గారు చెప్పేది ఏమిటంటే ఇప్పుడు నువ్వు దేహంగా ఉంటున్నావు, మనసుగా ఉంటున్నావు, దేహంగా ఉండే బదులు, మనసుగా ఉండే బదులు ఆత్మగా ఉంటే నీకు జ్ఞానం వచ్చేస్తుంది అంటున్నారు. నువ్వు దేహంగా ఉంటున్నావు, మనస్సుగా ఉంటున్నావు, అహంకారంగా ఉంటున్నావు, తెలివితక్కువగా ఉంటున్నావు, ఏదో ఒక రకంగా ఉండటం ఎలాగూ తప్పదు, ఆ ఉండేది ఏదో ఆత్మగా ఉండు, సత్యంగా ఉండు, నువ్వు ఏదైతే అవునో దానిగా ఉండు. నువ్వు జ్ఞానివి అయిపోతావు. మహా జ్ఞానివి అయిపోతావు. ఆత్మలో ఉంటే, చైతన్యంలో ఉంటే ఎటువంటి జ్ఞాని అయిపోతాడు? బ్రహ్మ దేవుడు, విష్ణు దేవుడు, శివ దేవుడు వచ్చి జ్ఞానికి కనిపించినా తల ఎత్తి చూడాలి అనిపించదు. అది జ్ఞాని యొక్క వైభవం. ఒకసారి రమణమహర్షి గారిని అడిగారు ఏవండీ బ్రహ్మ దేవుడు, విష్ణు దేవుడు, శివ దేవుడు వచ్చి మీకు కనిపిస్తారు అనుకోండి. మీకు ఏమైనా కోరికలు కావాలా నెరవేరుస్తాము అని అడుగుతారు అనుకోండి, మీరు ఏమైనా కోరికలు కోరుకుంటారా? అని అడిగారు. కోరుకుంటాను అని చెప్పారు. ఏమని కోరుకుంటారు అని అడిగితే మీరు ఎప్పుడూ నాకు కనిపించవద్దు అని కోరుకుంటాను అన్నారు. అదండీ జ్ఞానం యొక్క వైభవం. The Sage is Bodyless, the Sage is Mindless, the Sage is Worldless. ప్రపంచానికి అతీతంగా, దేహానికి అతీతంగా ఉన్న స్థితి జ్ఞానం యొక్క వైభవం అటువంటిది. ఇప్పుడు ఎలా ఉంటున్నావు నువ్వు? కోపంగా ఉంటున్నావు. చిరాకుగా ఉంటున్నావు. హెచ్చుతగ్గులుగా ఉంటున్నావు. అలా ఉండకు. ఎలా ఉండాలి? సమానంగా ఉండు, ఆత్మగా ఉండు, ఏదో ఒక రకంగా నువ్వు ఉండాలి కదా, ఆ ఉండేది ఏదో చెడ్డగా ఉండే బదులు మంచిగా ఉండు. అవివేకంగా ఉండే బదులు వివేకంగా ఉండు. ఆత్మగా ఉండు, సత్యంగా ఉండు, నిజముగా ఉండు. రమణమహర్షి గారిని దర్శించి ఒక సైంటిస్ట్ ఇలా చెప్పాడు ఆయనని దర్శించడం వలన నాకు ఒక లాభం కలిగింది. అప్పటివరకు హృదయంలో ఏమీ లేదు అనుకుంటున్నాను. ఆయనని చూసిన తరువాత హృదయంలో ఏదో ఒక నిజం ఉందన్న సంగతి నాకు తెలిసింది. కానీ నా హృదయంలో ఉన్న నిజం నాకు తెలియటం లేదు అన్న నిజం కూడా తెలుస్తోంది. హృదయంలో ఏదో ఒక నిజం ఉందని మటుకి నాకు స్ఫురించింది. కానీ అది నాకు అనుభవంలోకి రావడం లేదన్న సంగతి కూడా తెలుస్తోంది. ఉందని గుర్తించాడు కాబట్టి సాధన చేస్తే అనుభవంలోకి వస్తుంది. ముందు శ్రవణం చెయ్యాలి కదా, మహాత్ముల దర్శనం ఊరికే పోదు. రమణమహర్షి గారు చెబుతూ ఉండేవారు. ఈ అరుణాచలం వచ్చిన వాళ్ళు వట్టి చేతుల తోటి బయటకు వెళ్లరు. నాస్తికులు ఆస్తికులు

అవుతారు, ఆస్తికులు భక్తులు అవుతారు. భక్తులు జ్ఞానులు అవుతారు. జ్ఞాని మాత్రమే భగవంతుడి యొక్క స్వరూపాన్ని పొందుతాడు. భగవంతుడు అంటే ఆత్మ, ఆత్మ స్వరూపాన్ని పొందుతాడు. నువ్వు ఉన్నట్లే ఉండు. కొత్తవి శాశ్వతాలు కాదు. కొత్తగా వస్తే పోతూ ఉంటాయి. దేహం వచ్చింది కాబట్టి పోతుంది.

మనం అందరం పుట్టినప్పుడు ఏడుస్తాం, రమణమహర్షి గారు చెప్పేది ఏమిటి అంటే, నీ లోపల ఎంత ఏడుపు ఉందో అంతా నీకు చావు వచ్చే లోపుల ఖర్చు అయ్యిపోవటం మంచిది అన్నారు. ఏడుపు అంతా పోతే ఆనందం మిగులుతుంది. అశాంతి అంతా పోతే శాంతి మిగులుతుంది. దుమ్ము అంతా పోతే శుభ్రత మిగులుతుంది. మీరు పుట్టినప్పుడు ఎంత ఏడుపు అయితే ఏడ్చారో మీరు చనిపోయే లోపల మీ మనసులోని ఏడుపు అంతా బయటకి పోగొట్టేసుకోండి, బయటకి పోగొట్టేసుకుంటే ఇంక ఆనందమే మిగులుతుంది, శాంతే మిగులుతుంది, ఏడవడానికి ఏడుపు ఏమీ మీకు లేదు కాబట్టి ఇంక కొత్త జన్మలు రావు, కొత్త శరీరాలు రావు. ఏడుపు మిగిలిపోతేనే కొత్త జన్మలు వస్తాయి. అందుచేత మీరు పుట్టినప్పుడు ఏడ్చారు కాబట్టి చనిపోయేలోపు సాధన చేసి, ఆ ఏడుపుని పోగొట్టుకుంటే ఇంక మీరు శవాలను మోయక్కర్లేదు, ఏడవక్కర్లేదు. అది ఆయన చెప్పేది. ఆయన మాటలు కూడా బాగుంటాయి. వస్తువు ఆయన అనుభవంలో ఉంది కాబట్టి అది తీసి చెప్పటమే. ఆ శాస్త్రంలో ఇలా ఉంది, ఆ గ్రంథంలో ఇలా ఉంది అని చెప్పవలసిన పని ఆయనకి లేదు. ఆయన ఏ సబ్జెక్టు గురించి అయితే చెబుతున్నాడో అది ఆయన అనుభవం లోంచి చెప్పటం. ఎంగిలి ముక్కలు కాదు అవి. ఆయన అనుభవం లోంచి తీసి చెప్పటం. ఆయన మాటలు ఎలా ఉంటాయి అంటే రమణమహర్షి గారిని ఒక ప్లీడరు గారు ప్రశ్న అడిగారు దేవుడు ఉన్నాడా? లేడా? అని, రమణమహర్షి గారు ఏమన్నారు అంటే దేవుడు లేకపోతే గొడవే లేదు, ఉంటే నీ అవసరం వాడికి లేదు అన్నారు. దేవుడు అనేవాడు ఒకడు లేకపోతే గొడవే లేదు. నిజంగా దేవుడు ఉన్నాడు అనుకోండి నీ అవసరం వాడికి లేదు. ఇంకొకడు అడిగాడు రమణమహర్షి గారిని నాకు దేవుడిని తెలుసుకోవాలి అని ఉంది అన్నాడు. రమణమహర్షి గారు అన్నారు దేవుడు వచ్చి నిన్ను అడిగాడా నన్ను తెలుసుకోమని అన్నారు. ఆయన ఎప్పుడూ నన్ను అడగలేదు అని చెప్పారు. ఆయన అడగని దానికి నీకు ఎందుకు ఈ గొడవ అంతా అన్నారు.

మానవుడికి కావాల్సింది దేవుడు కాదు, మానవుడికి కావాల్సింది ఆనందం.

మానవుడికి కావాల్సింది సుఖం, మానవుడికి కావాల్సింది శాంతి, సుఖం, శాంతి, ఆనందం దేవుడిలో ఉన్నాయి. దేవుడిలో ఇవన్నీ ఉన్నాయి కాబట్టి మాకు దేవుడు కావాలి అంటున్నారు. అంటే వాడికి సుఖం కావాలి, శాంతి కావాలి, ఆనందం కావాలి. నూటికి నూరుపాళ్ళు సుఖం అనుభవిస్తుంటే మీరు, నూటికి నూరు పాళ్ళు శాంతి కనుక మీ అనుభవంలోకి వస్తే, దేవుడు సమస్యే మీకు ఉదయించదు. సుఖం కోసం బాహ్య వస్తువుల మీద ఆధారపడి ఉన్నాం, బాహ్యమైన పరిస్థితుల మీద ఆధారపడి ఉన్నాం. ఎవడికైతే ఆత్మానుభవం కలిగిందో వాడికి బాహ్యమైన వ్యక్తుల మీద కానీ, బాహ్యమైన పరిస్థితులు మీద కానీ, బాహ్యమైన వస్తువుల మీద కానీ వాడు సుఖానికి ఆధారపడడు. అది ఏమి సుఖం? స్వతంత్రమైన సుఖం. వాడి సుఖం స్వతంత్ర్యంగా ఉంటుంది. బాహ్య పరిస్థితుల మీద ఆధారపడి ఉండదు. రోజూ మాట్లాడే వాడు మీతోటి మాట్లాడడం మానేస్తేనే మీకు దుఃఖం వచ్చేస్తుంది. మనస్సు అంత అల్పంగా ఉంటుంది. జ్ఞాని యొక్క సుఖం అలా కాదు. వాడికి దేహం ఉన్నా ఒక్కటే, ఊడిపోయినా ఒక్కటే, ప్రపంచం కనిపించినా ఒక్కటే, కనిపించక పోయినా ఒక్కటే, వాడి సుఖానికి కానీ, వాడి శాంతికి కానీ అడ్డు ఏమీ లేదు. దేహం ఉన్నప్పుడు జ్ఞాని ఏ శాంతిని అనుభవిస్తున్నాడో, దేహం పోయిన తరువాత కూడా జ్ఞానికి అదే శాంతి అనుభవంలో ఉంటుంది. పైగా దేహం ఉండటం వల్ల ఏమిటి అంటే దానికి అదనపు చాకిరి చెయ్యాలి. దేహం పోతే ఇంక చాకిరి చెయ్యవలసిన పని వాడికి లేదు.

మీకు ఇష్టమైతే ధ్యానం చేసుకోండి. మీకు ఏదైతే తేలికగా ఉందో, ఏదైతే సులభంగా ఉందో, ఏదైతే ఈజీగా ఉందో ఆ మార్గాన్నే మీరు అనుసరించండి. కానీ ఏ మార్గాన్ని అనుసరించినప్పటికీ మీరు వేరుభావనని తొలగించుకోవాలి. ఒకవేళ మీకు ధ్యాన మార్గం ఇష్టమైతే మీరు దానిని అనుసరించవచ్చు. మనస్సులో ఒకే వస్తువుని ఏక చింతన కనుక మీరు చేస్తుంటే, ఒకే వస్తువుని కనుక మీ మనస్సు పట్టుకుని ఉంటే అప్పుడు ఇతర తలంపులు పారిపోతాయి. వాసనలే మనకి తలంపుల కింద వస్తాయి. మనకి తలంపు ఎక్కడ నుంచి వస్తుంది? వాసన లోంచి వస్తుంది. కృతిమహోదధౌ అంటే కర్మ సముద్రం.

**కృతి మహోదధౌ పతనకారణం**
**ఫల మశాశ్వతం గతి నిరోధకం ॥**

ఇది ఉపదేశసారంలో చెప్పారు. రమణమహర్షి గారిని ఎవరైనా ఉపదేశం చెప్పండి అంటే ఉపదేశం ఉపదేశసారంలో ఉంది కదా అనేవారు. ఇప్పడు మనం అందరం కర్మ

సముద్రంలో ఉన్నాం. కర్మ సముద్రం అంటే మనం ఏదో పని చేస్తాం. ఆ పని ఆశించి చేస్తాం. కామ్య కర్మలు మనం చేస్తాం. ఎవడైతే సత్కర్మని చేసి దాని ఫలితాన్ని విడిచి పెడతాడో సమాజానికి వాడు త్యాగి. అలా కాకుండా మొత్తానికి కామ్య కర్మలు అన్నీ ఎవడైతే విడిచి పెడతాడో వాడు సన్యాసి. సన్యాసం కంటే త్యాగం మంచిది అని చెప్పాడు భగవంతుడు వాసుదేవుడు. సర్వసాధారణంగా మనం స్వార్థం తోటే ఏ పని అయినా చేస్తాం. Commonman చేసేది ఏమిటి అంటే వాడు స్వార్థం తోటే చేస్తాడు ఏ పని చేసినా, కలిసొస్తే చేస్తాడు. కొంతమంది మనుషులు ఎలా ఉంటారు అంటే మీ ఇంటికొస్తే మాకేమి ఇస్తారు, మా ఇంటికొస్తే మీరు ఏమి తెస్తారు అంటూ ఉంటారు. మనం వంద సంవత్సరాలు జీవించాలి, నూట యాభై సంవత్సరాలు జీవించాలి అనుకుంటాము కానీ జ్ఞానం ఇంకా మనలని వరించలేదు, భగవంతుడు మనలని జ్ఞానంతోటి అలంకరించలేదు అనేటటువంటి భావన మనకి రాదు. సంవత్సరాలు లెక్కపెట్టుకుంటాం కానీ ఇంత వయసు వచ్చినా మనం జ్ఞాన సముపార్జన చెయ్యలేదు అనేటటువంటి భావన మనకు కలుగదు. భగవంతుడు చెప్పేది ఏమిటి అంటే నువ్వు పని చేస్తావు, పని చేస్తే ఫలితం వస్తుంది. ఆ ఫలితాన్ని ఎంజాయ్ చేస్తావు. నీ ఇంద్రియాల తోటి దానిని ఎంజాయ్ చేస్తావు. అలా ఎంజాయ్ చెయ్యగా చెయ్యగా వాసన పడుతుంది. ఆ వాసన లోంచి తలంపు వస్తుంది. పూర్వజన్మల్లో మనం ఏ పని అయితే ఎక్కువ చేశామో దానికి సంబంధించిన వాసనలు ఈ జన్మలో ఉంటాయి. ఆ వాసనే మన చేత ఆ పని చేయిస్తుంది. అంటే కర్మ చేస్తాం, కర్మ చేస్తే ఫలితం వస్తుంది. ఫలితం వస్తే దానిని అనుభవిస్తాం. అనుభవిస్తే వాసన పుడుతుంది. ఆ వాసన లోంచే తలంపు వస్తుంది. మళ్ళీ తలంపుని బట్టి పని చేస్తాం. ఇది కర్మ చక్రం. అందుచేత భగవాన్ ఏమని చెప్పారు అంటే వేరుభావన వల్ల ఇదంతా వస్తుంది. వేరుభావన నశిస్తేనే కానీ నీకు జ్ఞానం కలగదు. నేను దేహం లోపల ఉన్నాను, దేహం బయట లోకం ఉంది, ఎక్కడో దేవుడు ఉన్నాడు అంటే ఇదంతా వేరు భావనే. అద్వైతానుభవం లేని మూలాన ఇలా అనిపిస్తుంది. ప్రతీ మానవుడు ఏమనుకుంటున్నాడు? నేను దేహంలో ఉన్నాను అనుకుంటున్నాడు. నా దేహం బయట ప్రపంచం ఉంది అనుకుంటున్నాడు. దేవుడు వైకుంఠంలో ఉన్నాడు అనుకుంటున్నాడు. నీ దేహబుద్ధి వల్లే ఇదంతా నీకు నిజం కింద కనిపిస్తుంది. నీ దేహబుద్ధి వల్లే నువ్వు లోపల ఉన్నాను అనుకుంటున్నావు. నీ దేహబుద్ధి నశిస్తే నువ్వు లోపలా లేవు, బయటా లేవు.

రమణమహర్షి గారు స్కంధాశ్రమంలో ఉండగా కొంతమంది భక్తులు ఆయనతో ఏవండీ మీరు మాతోటే కూర్చుంటున్నారు, మాతోటే మాట్లాడుతున్నారు, మీరు లోపలకి వెళ్ళి

ధ్యానం చేసుకోండి అన్నారు. అప్పుడు రమణమహర్షి గారు ఏమన్నారు అంటే నేను బయట ఉన్నాను ఏమిటి నన్ను లోపలకు వెళ్ళమంటున్నారు అన్నారు. బయట ఉన్నవాడు లోపలకి వెళతాడు, లోపల ఉన్నవాడు బయటకి వస్తాడు. దేహబుద్ధి ఉన్నవాడికి లోపల, బయట. దేహబుద్ధి నశించిన వాడికి లోపల లేదు, బయట లేదు. దేహం లోపల నువ్వు ఉన్నావు అనుకుంటున్నావు కాబట్టి నీకు బయట ప్రపంచం కనిపిస్తుంది. ఎక్కడో దేవుడు ఉన్నాడు అని అనుకుంటున్నావు. ఇదంతా నీ తలంపు మాత్రమే. నీ మైండ్ యొక్క క్రియేషన్. మీకు అర్థం అవుతోందా? మనకి ఎవరికీ truth అంటే ఇష్టముండదు. దేవుడు అంటే ఇష్టముండదు. మన మనస్సు కల్పించే విషయాలనే మనం ఇష్టపడుతూ ఉంటాం. వాటితో మనం attract అవుతూ ఉంటాం. మనస్సు యొక్క మూలాన్ని వెతకడానికి మనం ప్రయత్నం చెయ్యము. మనస్సు కల్పించిన విషయాలు వెంటపడి మనం పోతూ ఉంటాం. నీకు అనేక తలంపులు వస్తాయి, అనేక సంకల్పాలు వస్తాయి, అనేక భావనలు వస్తాయి, అనేక ఊహాలు వస్తాయి. వస్తే రానీ వాటి కూడా నువ్వు పరుగు పెట్టకు. మహాత్మాగాంధీ గారు అనేవారు ఒకవేళ నీ మనస్సు సినిమాలకి వెళ్ళిపోతే నీ శరీరాన్ని వెళ్ళనివ్వకు. ఆ సినిమాల చుట్టూ తిరిగి మళ్ళీ మనస్సు వెనక్కి వచ్చేస్తుంది. మనస్సు సినిమాలకి వెళ్ళిపోయింది అని ఈ శవాలని తీసుకు వెళ్ళి అక్కడ పడేయ్యకు. నువ్వు కోరికను repeatedగా నేరవేరుస్తుంటే అది బలపడిపోతూ ఉంటుంది. మైండ్ వెళితే వెళ్ళనివ్వు కానీ నీ దేహాన్ని మటుకు అక్కడకి వెళ్ళనివ్వకు. ఒక పది నిముషాలు సినిమా హాలులో కూర్చుని మళ్ళీ వెనక్కి వచ్చేస్తూ ఉంటుంది మైండ్. Body దగ్గరకు వచ్చేస్తూ ఉంటుంది. అలా ప్రాక్టీస్ చెయ్యి, ఇది కూడా ఒక సాధనే అని మన జాతిపిత గాంధీగారు చెప్పారు.

మన పూర్వజన్మ సంస్కారాన్ని బట్టి, మన పూర్వజన్మలో చేసిన పనులు బట్టి అనేక రకాల తలంపులు వస్తూ ఉంటాయి. తలంపులు వచ్చాయి అని ఆ తలంపులు కూడా పరుగు పెట్టకు. వాటి తోటి విడిపోవడానికి నువ్వు ప్రయత్నం చెయ్యి. నీకు ఏ తలంపు వచ్చినా అదే నువ్వు అనుకోకు, అదే నువ్వు అనుకుంటే దాని బలం పెరిగిపోతూ ఉంటుంది. ఆ తలంపుని కనుక నువ్వు satisfy చేస్తే, ఆ desire ని కనుక నువ్వు satisfy చేస్తే, దాని strength పెరిగిపోయి అదే బలీయమైన వాసనగా నీలోకి ఎంటర్ అవుతుంది. అందుచేత నువ్వు ధ్యానం చెయ్యగా, చెయ్యగా ఇతర తలంపులు అన్నీ నశిస్తాయి. ఒకసారి రమణమహర్షి గారిని ఏమని అడిగారు అంటే మీరు చెప్పేది అద్వైత జ్ఞానం చెబుతున్నారు. అద్వైత అనుభవం గురించి చెబుతున్నారు. Wonderfulగా ఉంది మీరు చెప్పేది అంతా కూడా, మరి ఈ కొండ దేవుడు అంటారు ఏంటి అన్నారు. అప్పుడు భగవాన్ ఏమన్నారు అంటే అది కాదు, నువ్వు

ఈ దేహాన్ని వేసుకుని తిరుగుతున్నావు. ఈ శవాన్ని నేను నేను అనుకుంటున్నావు. దేవుడు ఏమో ఆ కొండ నేను, ఆ కొండ నేను, అంటున్నాడు. ఇది ఎంత నిజమో, అది అంతే నిజం అని చెప్పారు. ఈ శవాన్ని నేను, నేను అని నువ్వు ఎలా అనుకుంటున్నావో, దేవుడు ఆ కొండ నేను, ఆ కొండ నేను అని అంటున్నాడు. ఈ శరీరానికి ఎవడైనా నమస్కారం పెడితే మీరు ఏమనుకుంటున్నారు? నాకే నమస్కారం పెడుతున్నారు అనుకుంటున్నారు. ఎందుచేత? బాడీ identification బట్టి, అదే విధంగా ఈ కొండకి ఎవరైనా నమస్కారం పెడితే నాకే నమస్కారం పెడుతున్నారు అని దేవుడు అనుకుంటున్నాడు. ఎందుచేత? నువ్వు శవం తోటి ఏ విధంగా identify అవుతున్నావో, ఆ కొండ తోటి దేవుడు identify అవుతున్నాడు. నీకు నిజం కావాలా? సత్యం కావాలా? ఇది ఎంత సత్యమో, అది అంతే సత్యం. ఇది ఎంత నిజమో, అది అంతే నిజం. నువ్వు ఈ శవం తోటి తాదాత్మ్యం పొందుతున్నావు కాబట్టి దేవుడు ఆ కొండ తోటో, లేకపోతే గుళ్ళో ఉన్న రాయితోటో తాదాత్మ్యం పొందవలసి వచ్చింది ఆయనకి. నువ్వు ఈ శవం తోటి తాదాత్మ్యం పొందడం మానేస్తే ఆయనకి ఆ రాయి తోటి తాదాత్మ్యం పొందడం అక్కర్లేదు అని చెప్పారు. అది సబ్జెక్టు.

దేహబుద్ధి నశించాలి, వేరుభావన నశించాలి, ద్వైతబుద్ధి నశించాలి. దేహబుద్ధి ఉన్నంతకాలం ద్వైతబుద్ధి నశించదు. మన హృదయంలో ఉన్నటువంటి సత్యవస్తువు మనకి అనుభవంలోకి వచ్చినప్పుడు అంతటా మనమే, అంతా మనమే! ప్రపంచం అంతా కూడా పంచభూతాల తోటి తయారు అయ్యింది, లోకం దేనితోటి తయారు అయ్యింది? లోకం అంటే పంచభూతాలే! మన దేహం కూడా పంచభూతాల తోటి తయారు అయ్యింది. మనకి, జ్ఞానికి తేడా ఏమిటి అంటే మనం గుళ్ళోనే దేవుడిని చూస్తున్నాం, వాడు పంచభూతాల్లో కూడా దేవుడిని చూస్తాడు. సూర్యుడిలో దేవుడిని చూస్తాడు, చంద్రుడిలో దేవుడిని చూస్తాడు. వాడు అంతటా దేవుడిని చూస్తూ ఉంటాడు. మనకి దేవుడు ఉన్నచోటు కనపడదు, జ్ఞానికి దేవుడు లేని చోటు కనపడదు. సత్యం ఎక్కడ ఉంది? నీ హృదయంలో ఉంది. నీ హృదయంలో ఉన్న నిజాన్ని తెలుసుకున్నప్పుడే నీకు స్వేచ్ఛ, నీకు శాంతి, నీకు సుఖం, నీకు ఆనందం. ఏదో



**అలవాట్ల యొక్క వేగం లోపలనుండి విడుదల పొందటానికి గురువు అనుగ్రహం ముఖ్యం.**

ఒక రూపాన్ని మీరు తీసుకోండి, ఏదో ఒక నామాన్ని మీరు తీసుకోండి. మీకు ఇష్టమైన రూపం, మీకు ఇష్టమైన నామాన్ని తీసుకుని ఆ రూపాన్ని ధ్యానం చేసుకోండి. ఆ నామాన్ని స్మరించుకోండి. ఎందుకు అలా చెప్పారు అంటే, మనకి అందరికంటే మన రూపం అంటే మనకి బాగా ఇష్టం. అవతారపురుషుడు యొక్క రూపాన్ని, అవతారపురుషుడు యొక్క నామాన్ని ఎందుకు ధ్యానం చెయ్యమన్నారు అంటే, మనం ఆ రూపాన్ని ధ్యానం చెయ్యగా, చెయ్యగా మన రూపానికి మనం దూరం అవుతాము. నామం శ్రద్ధగా చెయ్యండి. అశ్రద్ధగా ఏ పని చెయ్యకూడదు. మనం చేసేది చిన్న పనే, మన అంతస్తుకి తగిన పనే, మన అర్హతకి తగిన పనే, మన యోగ్యతకి తగిన పనే మనం చేద్దాం. మనం చేసేది చిన్న పని అయినా అందంగా చెయ్యండి, శ్రద్ధగా చెయ్యండి, సమగ్రంగా చెయ్యండి, సంపూర్ణంగా చెయ్యండి, గొప్పల కోసం చెయ్యకండి. భగవంతుడి అనుగ్రహం సంపాదించడం కోసం, భగవంతుడి ప్రీతి కోసం మీరు ఆ పని చెయ్యండి. అప్పుడు మీకు రెండు లాభాలు వస్తాయి. మీరు భగవంతుడి అనుగ్రహం కోసం ఎప్పుడైతే మీరు పని చేస్తున్నారో, ఈ లోకంలో మీ యాత్ర సుఖంగా వెళ్ళిపోతుంది, తరువాత భగవంతుడి అనుగ్రహానికి కూడా మీరు పాత్రులు అవుతారు. అందుచేత నాకు ఏది మంచిదో అదే నువ్వు చేసిపెట్టు అని మీరు దేవుడిని ప్రార్థిస్తే, అప్పుడు మీకు శరణాగతి కుదురుతుంది. మీకు ఎప్పుడైతే శరణాగతి కుదిరిందో అప్పుడు మనస్సు నశిస్తుంది. మనస్సు నశించిన వెంటనే ఉన్న వస్తువు మీకు నేనుగా వ్యక్తం అవుతుంది.


**ఓం శాంతిఃశాంతిఃశాంతిః**


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక

**శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి** అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.



# అరుణాచల మహాత్మ్యం
# అక్షరమణమాల

**ఎవరు గనక నాదు మదిని మైకపరచి**

**కొల్లగొనిన దెవరరుణాచలా । 89 ।**

**తాత్పర్యము :** నా మనస్సుని మైకంలో పెట్టి, నాకు తెలియకుండానే నా అజ్ఞానాన్ని దోచుకున్నది ఎవరు అరుణాచలా?

నేను ఏ స్థితికి వచ్చానో అది వచ్చేవరకూ అసలు ఆ స్థితికి వచ్చినట్టు నాకే తెలియదు అన్నారు భగవాన్. రామకృష్ణ పరమహంస చెప్పేవారు ఈశ్వరుడి వైపు ఒక్క అడుగు వెయ్యి, ఈశ్వరుడు నీ వైపు తొమ్మిది అడుగులు వేస్తాడు అని. భగవాన్ చెప్పేది అది కూడా కాదు, ఆపరేషన్ చేయించుకున్న వాడికే తెలియదు ఆపరేషన్ జరిగినట్టు అసలు, అటువంటి కేసు భగవాన్. మోక్షం అనేది ఒకటి ఉందని, దానిని పొందాలి అని ఆయనకు ఏమి తెలియదు అసలు. ఆయన గ్రంథాలు చూస్తూ ఉంటే తన స్థితినే వర్ణిస్తున్నట్టు ఉండేవి.

ఎవరు గనక నాదు మదిని మైకపరచి - నన్ను మైకంలో పెట్టి నా మనసుని దొంగిలించావయ్యా నువ్వు. ఓ అరుణాచలేశ్వరుడా, నువ్వు దొంగ వాడివి, నాకు తెలియకుండానే నన్ను దోచేశావు. మనం ఈ మనసులోని అజ్ఞానాన్ని పోగొట్టుకోవడానికి సాధన చెయ్యలేక చస్తున్నాం. ప్రోగ్రెస్ ఎలా ఉన్నా సఫరింగ్ ఎక్కువ అయిపోతుంది. రమణ భగవాన్ అదృష్టం చూడండి - ఈ అజ్ఞానాన్ని ఎలా దోచేసావో, ఎప్పుడు దోచేసావో నాకు తెలియదు. నా కొంప పడగొట్టేసావు. ఊరికే అరుణాచలా అన్నాను అంతే, నాకు తెలియకుండానే నువ్వు ఈ పని అంతా పూర్తి చేసేసావు. ఈ జ్ఞాన సింహాసనం మీద ఎలా కూర్చోబెట్టావో కూడా నాకు తెలియదు. కాని కూర్చోబెట్టటం మట్టుకు కూర్చోబెట్టావు.

మనం ఏ విషయం ఆలోచించినా బాహ్య దృష్టితోటి ఆలోచిస్తున్నాం. మనకు అంతర

దృష్టి లేదు కదా, ఈశ్వరుడు ఎక్కడ ఉన్నాడు? మన హృదయంలోనే ప్రకాశిస్తున్నాడు. మనకు సరిగ్గా యోగ్యత, అర్హత వచ్చేటప్పటికి మన అజ్ఞానం మాడ్చేసి ఊరుకుంటాడు. మనకు తెలియకుండానే ఆ పని పూర్తి అయిపోతుంది, అసలు మన మనసు అటు తిప్పితే! ఈశ్వరుడు మన హృదయంలో సాక్షాత్తుగా ప్రకాశిస్తున్నాడు.

ఓ అరుణాచలా, ఎవరు నా మదిని కొల్లగొట్టారు అయ్యా? ఎవరు నా అజ్ఞానాన్ని కొల్లగొట్టారు? ఇదంతా నాకు తెలియకుండానే జరిగిపోయింది.నా అజ్ఞానం ఎలా పోయిందో, నా అహంకారం ఎలా పోయిందో, కనీసం నాకు కూడా తెలియకుండా ఈ ప్రక్రియ అంతా పూర్తి చేసేసావు. నా బ్రతుకు హరించావు. నాకు తెలియకుండానే నువ్వు ఇదంతా చేసేసావు.

మనకు అర్హత లేకపోతే, మనం డిజర్వ్ కాకపోతే మనం కోరుకున్నా రాదు. మనకు అర్హత కనుక ఉంటే కోరిక లేకపోయినా వస్తుంది. అది జ్ఞాపకం ఉంచుకోండి, భక్తి భావం పెంచుకోవాలి. గణపతి శాస్త్రిగారు భగవాన్‌ని ఎప్పుడూ ఏదో ఒక ప్రశ్న అడుగుతూ ఉండేవారు. దానికి భగవాన్ “మీ భారం అంతా ఈశ్వరుడి మీద వెయ్యండి, ఆయన మోయగలడు. ఈ లోకం బరువు అంతా మోసే ఈశ్వరుడు మీ ఒక్కడి బరువు మోయలేడా? మీరు నిశ్చింతగా ఉండండి, మీ భారం అంతా ఈశ్వరుడి మీద వేయండి” అనేవారు. మనం అందరం దేహం తోటి తాదాప్యం పొందుతాము. భగవాన్‌కి సాధన లేకుండా దేహంతోటి తాదాప్యం పోయింది. నాకు ఒక శరీరం ఉందని, ఆ శరీరానికి రెండు చేతులు ఉన్నాయని, అందులో ఒక చేతి మీద కురుపు ఉందని మీరు చెబుతుంటే నాకు తెలుస్తోంది అనేవారు భగవాన్. మనం ఈ శరీరం తోటి ఎలా అయితే తాదాప్యం పొంది ఉంటామో, మనకున్న అహంకారం తోటి మనం ఎలా అయితే తాదాప్యం పొంది ఉంటామో, జ్ఞాని ఆత్మతో అలా తాదాప్యం పొందుతాడు.

జపం చేసినా, ధ్యానం చేసినా, పూజ చేసినా, ఏది చేసినా పరమేశ్వరుడి ప్రీతి కోసం కనుక మనం చేస్తూ ఉంటే, ఆత్మ వైపు మన ప్రయాణం సాగుతూ ఉంటుంది. నీ అవసరాలు అన్నీ ఈశ్వరుడు తీరుస్తాడు. మన అవసరాలు ఏంటో మన కంటే ఎక్కువ ఈశ్వరుడికి తెలుసు. పరమేశ్వరుడి ప్రీతి కోసమే కనుక మనం పని చేస్తుంటే, మన అవసరాలు తీరిపోతుంటాయి. మనకు తెలియకుండా మనం ఆత్మ వైపుకి, సత్యం వైపుకి, ప్రయాణం చేస్తూ ఉంటాం.

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**

**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**

IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

# సత్సంగం

సద్గురు శ్రీనాన్నగారు తాను దేహధారిగా ఉన్న కాలములో సత్సంగాలకు పెద్దపీట వేసారు, అందువల్లే సత్సంగాలు నిరంతరాయంగా కొనసాగుతూనే ఉన్నాయి. "సత్సంగత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే నిశ్చలతత్త్వం, నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః" అన్నది శ్రీ ఆదిశంకరుల ఉవాచ. ఈ లోకములో మానవ దేహం లభించడం దుర్లభం, ఆ దేహం ఎప్పుడు నశిస్తుందో తెలియదు కావున ఉన్న కాలాన్ని సద్వినియోగం చేసుకుని సత్సంగంలో గడపాలి. సత్సంగాన్ని మన పాలిట పెన్నిధిగా భావించాలి. మన దగ్గర ధనం ఉంటే ఆ ధనములో సుఖాలు, భోగాలు ఎలాగైతే వస్తాయో, సత్సంగం వలన పరమాత్మతో ఐక్యమయ్యే సాధనలెన్నో దొరుకుతాయి. మన దైనందిన జీవితంలో శరీరము, వాక్కు, మనస్సు, బుద్ధి వీటి ద్వారా ఏది చేసినా అది గురు స్వరూపమైన పరమాత్మకు అర్పిస్తున్నాను అనెడి భావముతో చెయ్యాలి. సకల చరాచర జగత్తును పరమాత్మగా భావించాలి. శత్రువులని భావించే వారిపట్ల కూడా ప్రేమను చూపించాలే గాని ద్వేషించకూడదు. ద్వంద్వాల నుండి విడుదల పొందుతూ చిత్తశుద్ధిని, నిస్సంగత్వాన్ని సాధించాలి. అప్పుడు జన్మ వాసనలు నశించి ముక్తి స్వరూపంగా వ్యక్తమౌతుంది. జీవితంలో ఎదురయ్యే ప్రతి ఘట్టమును, మనలను మోక్ష పదానికి చేర్చే గురువుగా గ్రహించి, అహంకార రహితులం కావాలి. సాటి వారిని అకారణంగా, నిస్వార్థంగా ప్రేమిస్తూ, మనకు ఎదురయ్యే సంఘటనల నుండి పాఠాలు నేర్చుకోవాలి. శరీరము పుట్టినది మొదలు, అది స్మశానం చేరే వరకు జరిగేవి దేహానికి సంబంధించినవే కాని, స్వరూప ఆత్మకు అంటవు. ఈ సత్యాన్ని తెలుసుకోవడం వల్ల మనో నిశ్చలత ఏర్పడుతుంది. స్వప్నంలో అనుభవించే సుఖ దుఃఖాలు మెలకువ వచ్చిన తరువాత ఎలాగైతే అసత్యాలుగా గోచరిస్తాయో, అదే విధముగా జ్ఞానోదయంతో ఈ దేహముతో అనుభవించే సుఖదుఃఖాలు, ప్రాపంచిక విషయాలు, అసత్యమని బుజువవుతుంది. వేరుబుద్ధిని కలిగించే మనస్సే బంధ మోక్షాలకు కారణం. అజ్ఞాన ఫలితమైన వేరుబుద్ధిని విడిచిపెట్టి అందరిపట్ల కరుణ, మైత్రీ భావముతో మెలగాలి. భ్రాంతి విషయాల పట్ల అసంగత్వాన్ని, బుద్ధిలో ఉన్న దోషాలను తొలగించుకోవడానికి సత్సంగము మరియు సజ్జన సాంగత్యము ఎంతగానో ఉపయోగ పడతాయి. మనో మాలిన్యాన్ని తేలికగా వదిలించుకుని, బుద్ధిని శుద్ధి చేసుకునే విధానమే సత్సంగాలు. ఎవరి ప్రగతి అయినా, వారు చిత్తశుద్ధికై చేసే ప్రయత్నం మీదే ఆధారపడి ఉంటుంది. సత్సంగాలను ఉపయోగించుకుని 'మాయ' అనే మహా స్వప్నం నుండి విడుదల పొందాలి.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# తలరాతలు అనుభవిస్తాయి - ఊహలు ఊరేగుతూ ఉంటాయి

కర్మ వలయం నుంచి ఎవ్వరూ తప్పించుకోలేరు. మనిషి దుఃఖంలో కొనసాగాలని ఎవ్వరూ శాపమియ్యటంలేదు. మనకున్నది మన కనీసపు అవసరాలకు మించి ఉంది. దానితో తృప్తి పడాలి. కోరిక అనే ఊహ కలిగినప్పుడు దానితో ఊరేగక, చూడు ఏమీ అనకు. బయటకు కక్కకుండా, అణచకుండా, నిందించకుండా ఉండాలి. ఓటమికి వాడే కారణమని తీర్మానిస్తే అది దుఃఖాన్ని కలుగజేస్తుంది. జాగ్రదవస్థలో అదుపు చేస్తే స్వప్నములో ఊరేగుతుంది. కోరిక బుద్ధి తక్కువదని దుఃఖాన్ని సృష్టిస్తుందని సుఖంగా ఉండనియ్యదని సరళంగా గమనిస్తూ న్యాయమూర్తిలా కూర్చోవాలి. మన కర్మబీజాలే పుష్పించి ఫలిస్తాయి. అవి మనకు సంభవించినా ఇతరులెవరికో సంభవించినట్టుగా చూడాలి. సుఖదుఃఖాలు మనకన్నా భిన్నమైనవి. శరీరంతో తాదాత్మ్యం చెందకూడదు. అహంకారాన్ని గతాన్ని చంపాలి. వర్తమానంలో మనస్సు జీవిస్తే అవి చనిపోతాయి. భగవాన్ "కర్మలు ఎలా పోతాయి" అంటే "మర్చిపోతే పోతాయి" అన్నారు. "జీవితానికి పరమ లక్ష్యం ఉంటే మనస్సు హాయిగా ఉంటుంది". ఈ విషయాన్ని తరతరాలుగా గురువు చెబుతున్నా మనం గ్రహించటంలేదు. ఆదుర్దాలు, ఆరాటాలు ఏమి జరుగుతుందో అనే ఒత్తిడి అవి వదలకపోతే మనం పిచ్చివాళ్ళమైపోతాము. జరగవలసింది అంతా జరిగిపోయింది. భవిష్యత్తుకోసం ఊహిస్తూ వర్తమానాన్ని చెడగొట్టుకోకూడదు. మనలో పెల్లుబికే ఎన్నో ఊహలు లోపల దాచిపెట్టుకొన్నాము. అవి మనకు నరకాన్ని చూపిస్తాయి. మనం లోపలికి దిగి వాటిని చూడలేకపోతున్నాము. సాధారణ వ్యక్తి జీవితం అంతా క్రోధం, లోభం, పోట్లాటలు, తిట్లు అనే వృత్తంలో పగలు, రాత్రి గడిచిపోతూ ఉంటాయి. ఎప్పుడైనా కొంత విరామం ఉండవచ్చు. మరబొమ్మల్లా ఈ చిన్న జీవితంపై గిరగిరా తిరిగినా నిర్వాణం ప్రాప్తిస్తుందా! మన చుట్టుప్రక్కలవారు ఏమి చేస్తున్నది గమనిస్తూ ఉంటాము. లోపల గురువు యొక్క శుభ సందేశం వింటూ జీవించలేము. ఆ అనుకరణ ధనం, వస్తువాహనాలు లేదా ఏదో ఒకటి కావచ్చు. ఒకరితో ఒకరు సరిపోల్చుకోవటం అసంభవం. బుద్ధి అంటే మానసికమైన క్రీడ. కొత్తదనం రాదు. బుద్ధికుశలతతోనే భగవంతునితో భాగం పంచుకోవచ్చు. అందులో నవ్యత ఉంటుంది. గురు ధ్యాసలోను మౌనంగా ఉండటమే ధ్యానం. మనస్సు పెద్ద పెద్ద యాత్రలకు మార్గదర్శి. ఏ యాత్రకైనా వెళదామంటే సంతోషం. లేదా వినోదానికై టివి, సినిమాలు, బాతాఖాని వేసుకొన్నా బాగుంటుంది. అవి అన్నీ మనలను వశం చేసుకోవటానికి వేసే లంచాలు. ధ్యానం చేసేవాడికి ఈ విసుగు పెద్ద సమస్య. మన దుఃఖం ఇతరుల వల్ల కాదు మన తెలివితక్కువ ఊహలవల్ల. ఎరుకగా ఉంటే కర్మ బంధంగా మారదు. అప్పుడు మురికినీరు మనలను అంటుకోదు. ఈశ్వరుడు ఖచ్చితమైన న్యాయాన్ని పాలిస్తాడు. అపకారానికి ప్రతి అపకారం సృష్టించి తీరుతుంది. అదే సాధువులకు సత్‌పురుషులకు చేస్తే వెయ్యింతలై చేసినవాడికి దుఖఃపెడుతుంది. పుట్టుక చావుకు దారితియ్యటం తప్పనిసరి అలాగే పాపం శిక్షకు తప్పనిసరిగా దారితీస్తుంది. శ్రీనాన్నగారు "ఈ గంతు ఇక్కడ ఇలా వేద్దాము, ఆ గంతు అక్కడ అలా వేద్దామన్నా శిక్ష తప్పదు" అన్నారు. కాబట్టి చావురాకముందే ధ్యానంలో చావటం నేర్చుకోవాలి. ప్రకృతి పీడపోయి ఆనందంగా ఉంటాము.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**